సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.26, సరాసరిన రూ.37 ప్రకారం ధర పలికింది.



లడఖ్ జయకేతనం

రాజమాత జిజియాభాయి ఫుట్‌బాల్ ట్రోఫీ పోటీల్లో సోమవారం లడఖ్, మధ్యప్రదేశ్ జట్లు తలపడగా, లడఖ్ 3 గోల్స్‌తో ఏకపక్ష విజయం సాధించింది.

8లో

గరిష్టం/కనిష్టం
36.1°/22.4°

జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

- విడుదల చేసిన కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకూ సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ సంఘాలు 214, మీడియం ఇరిగేషన్ సంఘాలు 16 కలిపి మొత్తంగా 230 సంఘాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటన్నింటికీ ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇరిగేషన్ శాఖ ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాద్రి, ఏఈ జమునాభాయి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 26న సర్పంచ్‌లకు సన్మానం

ప్రశాంతి నిలయం: వివిధ కేంద్ర పథకాల అమలులో ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీల సర్పంచ్‌లను జనవరి 26న జరిగే రిపబ్లిక్‌డే వేడుకల్లో సన్మానిస్తామని కలెక్టర్ చేతన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పథకాల అమలులో 90 శాతం పైబడి ప్రగతి సాధించిన పంచాయతీలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పథకాల అమలుకు సంబంధించిన నివేదికలను పంచాయతీల అధికారులు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

కబ్జాల వీఆర్ఓ!

- వీఆర్ఓ సూర్య నారాయణ లీలలు
- తనతో పాటు బంధువుల పేరిట 25 ఎకరాలు ఆన్‌లైన్‌లోకి ..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చిన్న ఉద్యోగమైనా భారీగా ఆస్తులు కూడబెట్టుకోవచ్చు అని నిరూపించారు ఒక వీఆర్ఓ. ఎకరాల కొద్దీ ప్రభుత్వ, పేదల భూమిని తనతో పాటు బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని పాస్ బుక్కులు సృష్టించారాయన. వివరాలు... రాప్తాడు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన సూర్యనారాయణ వీఆర్ఏగా రెవెన్యూ శాఖలో చేరారు. ప్రస్తుతం రొద్దం మండలంలో వీఆర్ఓగా పనిచేస్తున్న ఈయన కబ్జాలకు మారుపేరుగా మారారు. తనకున్న పరిచయాలు, స్థానికంగా భూముల వివరాలు తెలుసుకుని ఏకంగా 30 ఎకరాలు కబ్జా చేశారు.

30 ఎకరాలకు..

రాప్తాడు మండలం యర్రగుంట గ్రామంలో సుమారు 30 ఎకరాలు కబ్జాకు గురైంది. శీలం సూర్యనారాయణతో పాటు అతని ఇంటిపేరుతోనే ఉన్న ఐదారుగురి పేరిట ఒక్కొక్కరికి 3 ఎకరాల నుంచి 7 ఎకరాల వరకూ రికార్డుల్లో నమోదైంది. ఈ భూమిని ఎవరు ఇచ్చారు, ఎలా రికార్డుల్లో ఎక్కింది, ఒకే కుటుంబానికి చెందిన వారికి ఎలా దక్కింది అనేది మిస్టరీగా మారింది. గొర్ల నల్లపరెడ్డికి 2001లోనే ప్రభుత్వం 3.80 ఎకరాలకు డీ పట్టా ఇచ్చింది. అప్పటినుంచి భూమిని ఆయన సాగు చేసుకుంటున్నారు. బోరు ఏర్పాటు చేసుకోవడంతో పాటు కరెంటు లైను, సబ్‌మెర్సిబుల్ మోటార్లు బిగించారు. అయితే, ఈ భూమిని సూర్యనారాయణ తన బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. తాజాగా జేసీబీతో కరెంటు పోళ్లు కూల్చేయించారు. పొలం ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని నల్లపరెడ్డి కుటుంబం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించారు.

ఎన్నో ఏళ్లుగా భూములున్నాయట!

వీఆర్ఓ సూర్యనారాయణ మాత్రం తమకున్న 5–25 ఎకరాల భూమిని తమ తండ్రి, ఐదుగురు అన్నదమ్ములు పేర రాయించారన్నారు. అయితే, ఇంకా ఆ భూమిని పంచుకోలేదని, భూ పంపిణీ జరిగితే పంచుకుంటామని పొంతనలేని సమాధానమిచ్చారు. ఆధారాలు మాత్రం లేవంటున్నారు.

మద్యానికి ఎస్.. వైద్యానికి నో!

ఆదాయమే తప్ప ప్రజల గోడు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది కూటమి సర్కారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు.. నేడు వాటిని పట్టించుకోవడమే లేదు. సూపర్ సిక్స్ హామీల ఊసే ఎత్తడం లేదు. ఇదే క్రమంలో ప్రజా క్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకూ ప్రస్తుతం మంగళం పాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని జనాభాకు అనుగుణంగా కొత్తగా 12 పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేయడమే దీనికి నిదర్శనం.



వైఎస్సార్ సీపీ హయాంలో అనంతపురంలోని కోర్టు రోడ్డులో అత్యాధునికంగా నిర్మించిన ఆస్పత్రి

- జనాభా ప్రాతిపదికన విభజించి మరీ మద్యం షాపులు
- మద్యం లైసెన్సు రేటు కూడా ఫిక్స్ చేసిన బాబు సర్కారు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రం నో చెప్పిన వైనం
- కొత్తగా ఏర్పాటు చేయాల్సిన 12 పీహెచ్‌సీలపై గొడ్డలి వేటు
- కొత్తగా సిబ్బందినీ నియమించేది లేదన్న కూటమి ప్రభుత్వం



అనంతపురంలోని ఓ వైన్‌షాపు వద్ద జనం రద్దీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో డయేరియా, డెంగీ జబ్బులు ప్రబలుతున్నాయి. మానసిక వ్యాధుల బాధితులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నారు. ఈ సమయంలో ప్రాథమిక ఆస్పత్రులను ఏర్పాటు చేయాల్సిన సర్కారు వాటికి ఉచ్చు బిగించింది. మద్యం షాపులకు మాత్రం బార్లా తెరిచింది. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులు ఇవ్వాలని ఏకంగా జీఓలోనే ఇచ్చారు. పాపులేషన్ (జనాభా)ను బట్టి మద్యం ధరలు నిర్ణయించారు. ఇదే ప్రాతిపదికన ఆస్పత్రులు, అందుకు తగ్గ సిబ్బంది ఏర్పాటు చేయడానికి మాత్రం సర్కారు తిలోదకాలిచ్చింది. ఆదాయం తెచ్చిపెడుతుంది కాబట్టి మద్యం బాటే పడతాం అన్న రీతిలో వ్యవహరిస్తోంది.

కొత్త పీహెచ్‌సీలకు మంగళం..

జనాభాను బట్టి ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్తగా 12 పీహెచ్‌సీలు ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో జీఓ జారీచేశారు. పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, 12 మంది సిబ్బంది కలిపి 14 మందిని నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే, అదే సమయంలో ప్రభుత్వం మారడంతో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు అంశం మరుగున పడిపోయింది. ఆ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేడు. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులు ఏర్పాటు చేస్తాం గానీ వైద్యం చేయలేమని నేడు కూటమి సర్కారు చేతులెత్తేసింది.

జబ్బులతో అల్లాడుతున్నా..

గత ప్రభుత్వం ప్రాథమిక వైద్యానికి పెద్దపీట వేసింది. వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, 104 వాహనాలు ఇళ్లకే వెళ్లి పేషెంట్లను చూడటం వంటి కార్యక్రమాలతో పల్లెవాసులకు భరోసా కల్పించింది. అప్పట్లో నిత్యం జబ్బులను జల్లెడపడుతూ బాధితులకు మందులిచ్చేవారు. కరోనా సమయంలో సర్కారే జనాన్ని కంటికి రెప్పలా కాపాడిన విషయం తెలిసిందే. కానీ నేడు జ్వరమొచ్చినా, కాళ్లూ చేతులూ విరిగినా పట్టించుకునే దిక్కు లేదు. కొన్నాళ్లుగా డయేరియా, డెంగీ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. హెపటైటిస్ బీ కేసులు భారీగా నమోదవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక మానసిక రుగ్మతలు పల్లెలనూ పట్టి పీడిస్తున్నాయి. పాముకాటు కేసులతో రెండు జిల్లాల్లో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రులను ఏర్పాటు చేయడం మరచి పెనుకొండలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని కూడా ఆపేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా మందులు లేవు. ఆరోగ్యశాఖలో కొత్త నియామకాలు, పదోన్నతులు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆస్పత్రుల వివరాలు	
కేటగిరీ	సంఖ్య
జనాభా	20,00,000
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	41
అర్బన్ హెల్త్ కేంద్రాలు	18
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	07
జిల్లా ఆస్పత్రి	01

మద్యం షాపుల వివరాలు	
మద్యం షాపులు	87
బార్ అండ్ రెస్టారెంట్‌లు	10

పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలి



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలకు నిధులు కేటాయించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనే నాణ్యమైన వైద్యం అందింది. కూటమి ప్రభుత్వంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పెట్టిన పేరును తొలగించడమే కాకుండా అందులో మౌలిక సదుపాయాలు తగ్గించేశారు. ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ చూపకుండా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యం షాపుల పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనుకున్న పీహెచ్‌సీలపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టిసారించాలి.

– రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి



కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలు ఖర్చు చేసుకుంటున్నారు. జిల్లాకు జనాభాప్రాతిపదికన మంజూరైన పీహెచ్‌సీల ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన వైద్యం అందుతుంది. ప్రభుత్వం ఇసుక, మద్యం దందాపైనే దృష్టిసారించింది. ఓపెన్ మార్కెట్‌లో మద్యాన్ని విచ్చలవిడిగా తాగించేలా చేస్తున్నారు. మద్యం షాపుల ఏర్పాటుతో మూడు రోజుల్లోనే రూ.541 కోట్లు తాగించేశారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు. మత్తుతోనే అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నాయి. ఓట్లేసిన ప్రజలకు బాధ్యతగా సేవలందించాలి.

– నాగేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇంటి పైకప్పు కూలి... చిన్నారికి తీవ్ర గాయాలు

- 14 మందికి త్రుటిలో తప్పిన ప్రమాదం



గాయపడిన చిన్నారి నీరజ

రొద్దం: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సోమవారం ఇంటిపైకప్పు కూలి ఐదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలాజీ, తన ఇద్దరు అన్నదమ్ములతో కలిసి మొత్తం 15 మంది పక్కనే ఉన్న మూడిళ్లలో నివాసం ఉంటున్నారు. ఈ మూడిళ్లకు కలిపి ఒకటే పైకప్పు ఉంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన ఇళ్లు... ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. సచివాలయ సిబ్బంది బాలాజీ కుటుంబీకులను హెచ్చరించినా... పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ఇంటిపైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఆడుకుంటున్న బాలాజీ కూతురు నీరజ గాయపడింది. మిగతా వారంతా బయట ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.

29 నుంచి వైద్య మిత్రల సమ్మె



సమ్మె నోటీసు అందిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: వైద్య మిత్రలు సమ్మెకు సిద్ధమయ్యారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌తో వారు ఈనెల 29 నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన నోటీసును సోమవారం జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవికి పలువురు వైద్యమిత్రలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేదలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఏళ్లుగా పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ సభ్యులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎవరూ స్పందించలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లనున్నట్లు వెల్లడించారు. గడువులోపు ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే సమ్మె తప్పదన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాల్సిందే

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 248 అర్జీలు



కలెక్టరేట్ గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బెల్, నాసిన్ భూ బాధితులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకి సకాలంలో పరిష్కారం చూపాల్సిందేనని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 248 అర్జీలు అందజేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారుతో సమావేశమయ్యారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. హౌసింగ్, రెవెన్యూ, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు, ఉపాధి పనులు తదితర వాటిపై అందే అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. మండల స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్‌తో పాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించండి..

గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద బెల్, నాసిన్ సంస్థల కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన తమకు పరిహారం మాత్రమే ఇచ్చారని, పునరావాసం కల్పించలేదని పలువురు బాధితులు కలెక్టర్ చేతన్‌కు తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు బాధితులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే పెద్ద సంఖ్యలో వచ్చిన వారిని పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో వారంతా సీపీఎం, సీఐటీయూ నాయకులతో కలసి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ, సీపీఎం నాయకులతో పాటు బాధితుల్లో కొందరిని కలెక్టర్ వద్దకు అధికారులు అనుమతించడంతో వారు వినతిపత్రం అందజేశారు. తమకు పునరావాసం కల్పించాలని కోరారు.

నకిలీ బంగారు నాణేల ముఠాల పనే!

- వీడుతున్న కాల్పుల కలకలం మిస్టరీ
- పోలీసుల అదుపులో ముఠా సభ్యుడు
- మిగతా వారిని పట్టుకునేందుకు రెండు బృందాలు



రామాపురం కూడలిలో పోలీసుల ఆరా (ఫైల్)

బత్తలపల్లి: మండల పరిధిలోని రామాపురం కూడలిలో ఆదివారం ఉదయం చోటు చేసుకున్న కాల్పుల ఘటన మిస్టరీ వీడుతోంది. నకిలీ బంగారు నాణేలు ప్రజలకు అంటగట్టే ముఠా... వారి చేతిలో మోసపోయిన ముఠా ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నకిలీ నాణేల విక్రయ ముఠాలోని ఒక సభ్యుడు పోలీసులకు పట్టుబడడంతో కాల్పుల మిస్టరీ వీడనున్నట్లు విశ్వసనీయ సమాచారం. నకిలీ నాణేల ముఠా, వారిని వెంబడించిన ముఠాలను పట్టుకునేందుకు సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఒక బృందం, ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఒక బృందం గాలింపు చర్యలు చేపట్టారు. వీరు వైఎస్సార్ జిల్లాలో, హైదరాబాద్‌లో గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో రాయచోటికి చెందిన వ్యక్తి

ఆదివారం ఉదయం రామాపురం కూడలిలో కాల్పులు, ఛేజింగ్‌తో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెండు ద్విచక్రవాహనాలు, రెండు కార్లలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు నడిరోడ్డుపై కాల్పులు, ఛేజింగ్‌లతో ప్రజలను హడలెత్తించారు. ద్విచక్రవాహనాల్లో వచ్చిన వ్యక్తులు నకిలీ బంగారు నాణేలు అమాయకులకు అంటగట్టే ముఠా కాగా, కార్లలో వచ్చింది ఈ ముఠా చేతిలో మోసపోయిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. కారులో వచ్చిన వారిని చూసి ద్విచక్రవాహనంపై ఉన్న ముఠాలోని సభ్యుడు చిత్రావతి నది వైపు పరిగెడుతుండగా.. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. అతను రాయచోటికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలుస్తోంది.

మోసపోయి...వెంబడించి

నకిలీ బంగారు నాణేలు అమాయకులకు అంటగట్టే ముఠా ముందస్తు ప్రణాళికలో భాగంగానే రామాపురం కూడలి వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎవరికోసమో ముఠా సభ్యులు వేచి చూస్తుండగా... వారి చేతిలో మోసపోయిన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు కార్లలో వచ్చి... ముఠా సభ్యులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే వారిని చూసి నకిలీ బంగారు నాణేలు విక్రయించే ముఠా సభ్యులు అప్రమత్తమయ్యారు. ఎయిర్‌గన్నులు పేల్చడంతో భయపడిన ముఠాలోని ఓ సభ్యుడు ఒక మూటను వారివైపు విసిరినట్లు తెలిసింది. ఆ మూటను తీసుకుని కార్లలో వచ్చిన వారు తిరుగుప్రయాణం అయినట్లు సమాచారం. అయితే కార్లలో వచ్చిన వారు నిజమైన పోలీసులని భయపడిన నకిలీ బంగారు నాణేల ముఠాలోని ఓ సభ్యుడు పారిపోతూ స్థానికులకు పట్టుబడగా..వారు పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలోనే అతన్ని విచారించిన పోలీసులు ఈ ఘటన పూర్తి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా దీనిపై పోలీసులను వివరణ కోరగా... తాము ఎవరినీ అదుపులోనికి తీసుకోలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న
- విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు ఆర్థిక సాయం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జడ్జీలు, ఎమ్మెల్యేలు



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న అన్నారు. సోమవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, సీనియర్ సివిల్ జడ్జి శైలజ, సివిల్ జడ్జి రాకేష్, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ముఖ్య అతిథులు, పోలీసుల కుటుంబీకులు, పోలీస్ సిబ్బంది అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, సమాజంలో పోలీస్ పాత్ర చాలా కీలకమైందన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించి అమరులైన పోలీసులను అందరం గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఎస్పీ తీసుకొంటున్న చర్యలు అభినందనీయమని కొనియాడారు.


ఖాకీ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలి..

జిల్లాలోని ప్రతి పోలీసు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఖాకీ ప్రతిష్ట పెంచే విధంగా పనిచేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో దేశ వ్యాప్తంగా 256 మంది పోలీసులు ప్రాణ త్యాగం చేశారని, అందులో జిల్లాకు చెందిన వారు ఇద్దరు ఉన్నారన్నారు. అమరవీరుల కుటుంబాల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు మాట్లాడుతూ, అంకిత భావంతో పనిచేస్తున్న పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయామని అధైర్య పడకూడదన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని అమర వీరుల కుటుంబీకులకు హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత..

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందుకున్న వారిలో బాబావలి భార్య సదాసేనా, చంద్రశేఖర్ తల్లి నారమ్మతో మరో ఆరుగురు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, శివన్నారాయణ, వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సునీత, ఆర్ఐలు వలి, చంద్రశేఖర్, రవికుమార్‌తో పాటు ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి సమస్యపై 25న ప్రత్యేక వైద్య శిబిరం



హిందూపురం టౌన్: వినికిడి సమస్యతో బాధపడే వారి కోసం ఈ నెల 25న హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డీఈఐసీ కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్–జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ చెవుడు నిర్మూలన నియంత్రణ కార్యక్రమం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వినికిడి మిషన్ల కోసం ప్రత్యేక క్యాంపులో నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లాలో వినికిడి సమస్యతో బాధపడుతున్న 19 ఏళ్లలోపు వయసు కలిగిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, చెవి డాక్టర్ పరీక్షించి రాసిచ్చిన ఓపీ చీటీ, ఆడియాలజిస్ట్ రిపోర్టు వివరాలు గల పత్రాలను తీసుకురావాలని డీఈఐసీ వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

నిండుకుండలా సీజీ ప్రాజెక్టు



సీజీప్రాజెక్టు గేటు తెరిచిన దృశ్యం

తనకల్లు: మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీ ప్రాజెక్టు) నీటితో నిండుకుండలా ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజీ ప్రాజెక్టు పూర్తిగా నిండింది. కర్ణాటక ఎగువ ప్రాంతాల నుంచి వరద భారీగా వస్తుండటంతో అధికారులు సోమవారం తెల్లవారుజామున ప్రాజెక్టు మూడుగేట్లలో ఒక గేటును ఎత్తారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

'ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేస్తున్నాయి'

హిందూపురం టౌన్: రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఆంజనేయ రైస్ మిల్లు వద్ద ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా రైతుల ప్రథమ మహాసభలు నిర్వహించారు. ఏఐకేకేఎంఎస్ జిల్లా నాయకులు రంగనాయకులు అధ్యక్షతన జరిగిన మహాసభల్లో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగముత్యాలు, రాష్ట్ర అధ్యక్షుడు గిరీష్ ముఖ్య అతిథులుగా మాట్లాడారు. రైతులు ఐక్యమై ప్రశ్నించినప్పుడు మాత్రమే రైతు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పాలకు, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నికరజలాలను కేటాయించాలని కోరారు. అనంతరం శ్రీ సత్యసాయి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంజురాయప్ప, ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి, కార్యదర్శిగా రంగనాయకులు, కోశాధికారిగా శంకరప్ప, సభ్యులుగా నరసింహప్ప, జయరామప్ప, శంకరప్ప, నంజెగౌడ, చలపతి, కిష్టప్ప, శంకర్ రెడ్డి, నాగరాజు, గోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు: ఆటో ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన రామ్‌చరణ్, బద్దలాపురం గ్రామానికి చెందిన గణేష్ అనే ఇద్దరు యువకులు సోమవారం ఉదయం మద్దెలచెరువు నుంచి ఆత్మకూరుకు ఆటోలో బయల్దేరారు. ఆత్మకూరు మండలం పాపంపల్లి వద్ద ఆ గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్‌ను ఆటోలో ఎక్కించుకున్నారు. ఆత్మకూరులోని సివిల్ సప్లయ్ గోదాము వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆటోలో ఉన్న రామ్‌చరణ్, గణేష్‌కు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో మరో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల, గొంతు భాగాల్లో గాయాలైన వెంకటేష్‌నాయక్‌ను 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఆద్యంతం అద్భుతం



ఆద్యలక్ష్మి నాట్యప్రదర్శనలోని ఒక ఘట్టం

- నాట్య విన్యాసం.. సమ్మోహనం
- శాస్త్రీయ నృత్యంలో అదరగొడుతున్న ఆద్యలక్ష్మి
- ప్రముఖుల ప్రశంసలు.. పలు అవార్డులు సొంతం
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

'పిట్ట కొంచెం.. కూత ఘనం' సామెత ఆ చిన్నారికి సరిగ్గా సరిపోతుంది. వయసు ఐదేళ్లే. అయినా తన నాట్య విన్యాసంతో అందరినీ సమ్మోహితులను చేస్తుంది. రాష్ట్ర గవర్నర్ తన ఇంటికి పిలిపించుకుని చిన్నారి నాట్య ప్రదర్శనను తిలకించి పులకించిపోయారు. ప్రముఖుల చేత ప్రశంసలు.. లెక్కకు మించి బహుమతులతో ఏకంగా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకుంది.



గవర్నర్ నజీర్ అహ్మద్‌తో ఆద్యలక్ష్మి

మెప్పించిన ప్రదర్శనలెన్నో..

- 2022లో తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆద్యలక్ష్మి నాట్య ప్రదర్శన ఇచ్చింది. ఆ ఉత్సవాల్లో చిన్నారి నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- 2024 మార్చిలో గవర్నర్ నజీర్ అహ్మద్ ఆద్యలక్ష్మి గురించి సోషల్‌మీడియా ద్వారా తెలుసుకుని స్వయంగా ఫోన్ చేసి రాజ్‌భవన్‌కు పిలిపించుకుని నాట్య ప్రదర్శన తిలకించి అభినందించారు.
- ఆద్యలక్ష్మి అనతికాలంలోనే వివిధ రాష్ట్రాల్లోని ఆధ్యాత్మిక వేదికలపై శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చి మైమరిపించింది. హంపి ఉత్సవాల్లో ఆత్మీయ అతిథిగా ఆద్యలక్ష్మి ప్రదర్శనలిచ్చి ఆకట్టుకుంది.
- దసరా సందర్భంగా మైసూరు ఉత్సవాలు, విజయవాడ కనక దుర్గమ్మ సన్నిధి, శ్రీశైలం మహాశివుడి బ్రహ్మోత్సవాలు, కాణిపాకం ఉత్సవాలు, ఒంటిమిట్ట రాములోరి వేడుకలు ఆద్యలక్ష్మి ప్రతిభకు చక్కటి వేదికలుగా నిలిచాయి.
- ఇదే ఏడాది హైదరాబాద్ రవీంద్రభారతిలో అనంత కీర్తిని చాటింది. అదే రోజు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుని 'వండర్ కిడ్' బిరుదు అందుకుంది. బెంగళూరులో కల్చరల్ ఆర్ట్ పామ్‌లో ఆద్యకు జాతీయస్థాయి ప్రథమ బహుమతి దక్కించుకుంది.
- హైదరాబాద్‌లో జరిగిన ఉగాది పురస్కార వేడుకల్లో 'బాల తేజం' అవార్డును అందుకుంది.

అనంతపురం కల్చరల్: చిరుప్రాయంలోనే కూచిపూడిలో అరంగేట్రం చేసి అబ్బురపరుస్తోంది ఆద్యలక్ష్మి. నాట్య ప్రదర్శనలో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తోంది. అనంతపురం నగరానికి చెందిన రొబ్బి అరుణ్‌కుమార్, నాగార్పిత దంపతులకు ఆద్యలక్ష్మి 2019 సంవత్సరంలో జన్మించింది. తల్లిదండ్రులతో పాటు అవ్వాతాతలు ధరణి, విశ్వనాథం చిన్నారిని శాస్త్రీయ నృత్యంలో తీర్చిదిద్దాలని భావించారు. అనుకున్నదే తడవుగా శారదామాత సన్నిధిలో 'గురుశ్రేష్ఠ' రమ్యకృష్ణ చేత కూచిపూడిలో అరంగేట్రం చేయించారు. నాట్య రీతులను ఆకళింపు చేసుకున్న ఆద్యలక్ష్మి ముందుకు సాగింది. నాట్యంలో విశేష ప్రతిభకనబరుస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంది. యూకేజీ చదువుతున్న ఈ చిన్నారి అంచలంచెలుగా నాట్యంలో ప్రావీణ్యం సంపాదిస్తూ అవార్డులు, ప్రశంసలతో దూసుకుపోతోంది.

ప్రోత్సాహముంటే సాధ్యమే



'ఒకప్పటితో పోలిస్తే ఇప్పటి చిన్నారులు ఎంతో తెలివి తేటలు, అద్భుతమైన మేధస్సు కల్గి ఉన్నారు. వారిలో ఉండే ట్యాలెంట్ గుర్తించాలే కానీ వారి ప్రతిభను చాటడం పెద్ద సమస్య కాదు. ఆద్యలక్ష్మి అమ్మనాన్నలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వారు ఉద్యోగాల్లో బిజీగా ఉంటున్నా.. మేమే ఆద్యలక్ష్మిని నాట్య ప్రదర్శనలకు తీసుకెళ్తున్నాం. ఆమెకు మా వంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తున్నాం.

– ధరణి, విశ్వనాథం, ఆద్యలక్ష్మి అవ్వతాతలు

పోలీసు వ్యవస్థలో భయానక పరిస్థితి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్..లా అండ్ డిసార్డర్‌గా మారిపోయింది. సాక్షాత్తు ఓ సీఐ తల్లి దారుణ హత్యకు గురైంది. ఎస్ఐ, తదితర పోలీసులపై దాడులు, ఐపీఎస్, డీఎస్పీ అధికారుల సస్పెన్షన్లతో పోలీసు వ్యవస్థలో భయానక పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది' అని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. సోమవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అవుతోందన్నారు. రాష్ట్రంలో బాలికలు, యువతులపై అత్యాచారాలను నియంత్రించడంలో చర్యలు తీసుకోవాల్సిన హోంమంత్రి అనిత మిన్నకుండిపోతున్నారన్నారు. కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో వాసంతి, పుంగనూరులో అంజుమ్, చిలమత్తూరులో అత్తాకోడళ్లపై అత్యాచారం, ఆస్పరిలో అశ్విని, బద్వేల్‌లోదస్తగిరి, మదనపల్లిలో స్వర్ణ కుమారి (ఇన్‌స్పెక్టర్ తల్లి)పై జరిగిన దాడులను ఆయన గుర్తు చేశారు. అత్తాకోడళ్లపై అత్యాచారం జరిగితే.. అక్కడి ఎమ్మెల్యే బాలకృష్ణకు హోం మంత్రి కాళ్లు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. హోం మంత్రి తన బాధ్యతను గుర్తెరిగి మహిళలకు భద్రత కల్పిస్తే మీ కాళ్లు మొక్కుతామని మాధవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యం చేసుకుని దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. ఇసుక, మద్యం పాలసీలతో ప్రజాప్రతినిధులు జేబులు నింపుకుంటున్నారన్నారు. తల్లికి వందనం, ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని మండిపడ్డారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు ఇంతవరకూ సాయం అందించలేదన్నారు. పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు సూపర్ అని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును లోఫర్ అని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను జోకర్ అని ప్రజలు అభివర్ణిస్తున్నారన్నారు. జమిలి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నసనకోట ముత్యాలు, కుంటిమద్ది రమేష్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రుట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహ్మద్

హిందూపురం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న దాదాపు వెయ్యి ఉపాధ్యాయ పోస్టులను త్వరలో నిర్వహించే డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రుట) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఫైరోజ్ అహమ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురంలోని అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రుట సమావేశం జరిగింది. ముఖ్య అతిథి ఫైరోజ్ అహమ్మద్ మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలల్లో 238 ఉర్దూ భాషాపండితులను నియమిస్తామని చెప్పిన ఉన్నతాధికారులు ఆరు నెలలైనా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వరకు ఉర్దూ మీడియం సబ్జెక్టు టీచర్ల స్థానాల్లో ఉర్దూ వర్ణమాల రాని ఇతర మీడియం ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వెంటనే ఆ ఉపాధ్యాయులను వెనక్కు రప్పించి ఆయా స్థానాల్లో ఉర్దూ విద్యావలంటీర్లను నియమించాలన్నారు. జిల్లా సీఎంఓ, ఏఏఎంఓ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, అజీజియా కాంప్లెక్స్ చైర్మన్ రంగనాయకులు, లెక్చరర్స్ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రషీద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ రఫీక్, ఆరిఫ్ అమిని, లనీస్, షేక్‌ఖాజావలి, ముస్తాక్ అహమ్మద్, నూర్ షరీఫ్, షఫీవుల్లా, మహమ్మద్ అన్సార్, మహమ్మద్ ఇర్షాద్, ఇర్ఫాన్ కౌసర్, కరీం, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మనోజ్‌కుమార్ (ఫైల్)

మడకశిరరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెచ్ ఆర్.పాళ్యం గ్రామానికి చెందిన నాగరాజప్ప కుమారుడు మనోజ్‌కుమార్ (21) ఐటీఐ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నా ఎక్కడా దొరకలేదు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు పెరిగి మనస్తాపానికి గురైన మనోజ్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన తల్లి తలుపు తీసి చూడగా ఉరికి వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మనోజ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో మరొకరు..

తాడిమర్రి: నార్సింపల్లికి చెందిన చిరంజీవి (45) అనే కూలీ సోమవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిరంజీవి రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి నొప్పులతో బాధపడుతుండేవాడు. ఆస్పత్రిలో చూపించుకున్నా తగ్గకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో లడఖ్ జట్టు విజయం

- అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా మధ్య మ్యాచ్ డ్రా



గోల్‌కొట్టిన ఆనందంలో లడఖ్ క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ క్రీడామైదానంలో రాజమాత జిజాబాయి ట్రోఫీ -2024 సీనియర్ మహిళల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం లడఖ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌ను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ ప్రారంభించారు. లడఖ్ రెండో గోల్స్ చేయగా, మధ్యప్రదేశ్ ఒక గోల్ కూడా సాధించకపోవడంతో చతికిలపడింది. దీంతో లడఖ్ జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక జట్టు కూడా గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. భారతదేశంలోనే ఈ రెండు జట్లు టాప్‌లో ఉన్నాయి. ఈ రెండు జట్లలో ఉన్న క్రీడాకారులే భారత దేశ జట్టుకు సింహభాగం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, మాజీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పాల సయ్యాట

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లి సమీపాన ఓ పొలంలో సోమవారం రెండు పాములు సయ్యాటలాడుతూ కనిపించాయి. కొంతసేపటి తర్వాత అక్కడికి జనాలు చేరుకోవడంతో సర్పాలు విడిపోయి వెళ్లిపోయాయి.



హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం



ముద్దాయి రుద్రేష్

అనంతపురం/కంబదూరు/కూడేరు: హత్య కేసులో ఓ వ్యక్తికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. దీంతో పాటు ముద్దాయికి రూ.25 వేల జరిమానా విధించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సంచలన తీర్పు వెలువరించారు. వివరాలు.. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన రుద్రేష్ ఎంఏ (ఇంగ్లిష్) చదివాడు. అతని భార్య పార్వతి బీఈడీ పూర్తి చేసింది. ఇద్దరూ కళ్యాణదుర్గంలో ట్యూషన్లు చెప్పుకుంటూ వచ్చే డబ్బులతో జీవనం చేసేవారు. గతంలో ఒక రోజు రుద్రేష్ ఫోన్‌కు అనంతపురం నగరానికి చెందిన విజయలక్ష్మి రాంగ్‌కాల్ చేసింది. ఒకరినొకరు మాటామాటా కలిపారు. ఆ తర్వాత మళ్లీ మళ్లీ మాట్లాడుకుంటూ వాట్సాప్‌లో మెసేజ్‌లు చేసుకునే స్థాయికి వెళ్లారు. డీఈడీ పూర్తి చేసిన విజయలక్ష్మికి అప్పటికే వివాహమైంది. భర్త ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. వారికి ఒకటిన్నర సంవత్సరం గల బాలుడు ఉన్నాడు. అయినా, ఆ బంధాలన్నీ రుద్రేష్, విజయలక్ష్మి మరచిపోయారు. అక్రమ సంబంధం పెట్టుకున్నారు. కొన్నాళ్లకు విజయలక్ష్మి తనను పెళ్లిచేసుకోవాలంటూ రుద్రేష్‌ను డిమాండ్ చేయడం ప్రారంభించింది. తాను భర్తను వదిలి వస్తానని, నువ్వు కూడా భార్యను వదిలి వస్తే ఇద్దరం పెళ్లి చేసుకుందాం అనేది. విషయం రుద్రేష్ భార్యకు తెలియడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. మరో వైపు విజయలక్ష్మి రుద్రేష్‌ను బెదిరించడం ప్రారంభించింది. నీవు పంపిన వాట్సాప్ మెసేజ్‌లు, ఫొటోలను పోలీసులకు చూపి కేసు పెడతా అంటూ బెదిరించేది. దీంతో మానసిక సంఘర్షణకు లోనైన రుద్రేష్ విజయలక్ష్మిని తుదముట్టించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే 2018 సెప్టెంబర్ 4న రుద్రేష్‌కు ఫోన్ చేసిన విజయలక్ష్మి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మరుసటి రోజు బయటకు వస్తున్నానని, నువ్వు కూడా రావాలని రుద్రేష్‌ను కోరింది. ఇదే అదనుగా భావించిన అతను ఆమె చెప్పినట్టుగానే సెప్టెంబర్ 5న ఉదయం 10 గంటలకు అనంతపురం చేరుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ స్కూటీలో కూడేరు మండలం ఉదిరిపికొండ- శివరాంపేట గ్రామాల మధ్యలో ఒక గుట్ట వద్దకు చేరుకున్నారు. విజయలక్ష్మిని చంపాలని పథకం వేసుకున్న రుద్రేష్ ఆమె గొంతుకు ఆమె చున్నీతోనే గట్టిగా బిగించి, ఊపిరి ఆడకుండా చేశాడు. అక్కడే ఉన్న ఓ బండరాయితో ఆమె తలపై మోది అతి కిరాతకంగా హత్య చేశాడు. విజయలక్ష్మి శరీరంపై ఉన్న నగలు తీసుకుని కళ్యాణదుర్గం చేరుకున్నాడు. ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.లక్ష లోన్ తీసుకుని, తన భార్య పార్వతి కోసం స్థానికంగా ఓ బంగారు షాపులో నల్లపూస దండకు రూ.30 వేలు అడ్వాన్స్ కట్టి ఆర్డర్ ఇచ్చాడు. మరుసటి రోజు ఎల్ఈడీ టీవీ కొనుగోలు చేశాడు.

ఫిర్యాదుతో వెలుగులోకి..

బయటకు వెళ్లిన భార్య రాకపోవడంతో విజయలక్ష్మి భర్త టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే ఉదరిపికొండ- శివరాం పేట గ్రామాల సమీపంలో విజయలక్ష్మి మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ ప్రసాద్‌రావు మృతురాలి సెల్‌ఫోన్, సీసీ కెమెరాల ఆధారంగా రుద్రేష్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. 15 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. రుద్రేష్‌పై నేరం రుజువు కావడంతో అతనికి యావజ్జీవ కఠిన కారాగారశిక్ష విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున రాచమల్లు హరినాథ్ రెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ పి. ప్రసాదరావు, కోర్టు మానిటరింగ్ సిస్టం హెడ్‌కానిస్టేబుల్ ఎస్. మల్లిరెడ్డి, కానిస్టేబుల్ బి.రాంమోహన్, ఏ. రాముడు, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులును ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

విషపూరితమైన పుట్టగొడుగులు తిని అస్వస్థత



హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చిలమత్తూరు: వర్షాకాలంలో సహజంగా పుట్టగొడుగులు దొరుకుతుంటాయి. అయితే అందులో తినడానికి పనికొచ్చేవి, విషపూరితమైనవి ఉంటాయి. పుట్టగొడుగులు దొరికాయన్న ఆత్రుతలో విషపూరితమైనవి తిని ఓ కుటుంబం తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైంది. ఈ సంఘటన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం ఆదేపల్లిలో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన శ్రీనివాసులు, అలివేలమ్మ, శాంతమ్మ, రంగప్ప, లక్ష్మి, వెంకటశివప్ప విషపూరితమైన పుట్టగొడుగులు తినడంతో వాంతులు అయ్యాయి. ప్రమాదమని భావించిన వారు హుటాహుటిన గ్రామస్తుల సాయంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యాధికారిణి డాక్టర్ తేజశ్విని వారిని పరీక్షించి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో 108 వాహనంలో హిందూపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం







మృతుడు శేషాద్రి (ఫైల్), మృతుడు గంగరాజు గాయపడిన దివ్యశ్రీ

రొద్దం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కోగిరకు చెందిన గంగరాజు (20) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై పెనుకొండవైపు వస్తున్నాడు. రొద్దంకు చెందిన శేషాద్రి (21) తన సోదరి దివ్యశ్రీతో కలిసి పెనుకొండ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎల్‌బీ నగర్ సమీపాన పావగడ- పెనుకొండ రోడ్డుపై వీరి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగరాజు, శేషాద్రి మృతి చెందారు. గాయపడిన దివ్యశ్రీని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల వాలీబాల్ పోటీలు సోమవారం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర హాజరయ్యారు. తొలుత జాతీయ జెండా, క్రీడా జెండాలు ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జట్లు ఉత్తర్‌ప్రదేశ్‌లో నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో విద్య, క్రీడా శాఖ అధికారులు, పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపై దాడిచేసిన తమ్ముడి అరెస్ట్

మడకశిర: అన్నపై కత్తితో దాడి చేసిన తమ్ముడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ రామారావు తెలిపారు. పట్టణంలోని మదీనా మటన్ షాపు వద్ద ఆదివారం సాయంకాలం ఆస్తి విషయమై అన్నదమ్ములైన షేక్ ఇబ్రహీం, ఇమాందుల్లా మధ్య ఘర్షణ జరిగింది. అన్న ఇబ్రహీంపై తమ్ముడు ఇమాందుల్లా మటన్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు ఇమాందుల్లాను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించారు.

రెండు దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన షాపును పరిశీలిస్తున్న పోలీసులు

గోరంట్ల: గోరంట్లలోని చిత్రావతి నది సమీపాన రెండు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దాదాపీర్ ఎలక్ట్రికల్ షాపు పైకప్పు రేకులను తొలగించి దుండగులు లోనికి ప్రవేశించి రూ.5లక్షల విలువ చేసే విద్యుత్ మోటర్లతో పాటు వైరు, పరికరాలు అపహరించుకుపోయారు. ఈ షాపు పక్కనే గల కలీం టీస్టాల్ షెట్టర్‌ను కూడా దుండగులు పగులగొట్టి రూ.2వేలు విలువ చేసే సిగరెట్లు, బీడీల బండిళ్లు ఎత్తుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ బోయ శేఖర్ సోమవారం సంఘటన స్థలాలను పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి సీసీ కెమెరా ఫుటేజీ, దుండగుల వేలిముద్రలు సేకరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నేకొత్తపల్లి: ప్యాదిండి పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న 12మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వీరి నుంచి రూ.11,230 నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



పేకాటరాయుళ్లతో పోలీసు సిబ్బంది